# జెన్ జీరో ఇంక్

## - నిర్మలాదిత్య



### నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

## 'దైవ ఘటన( ఆక్ట్ ఆఫ్ గాడ్)'
## (మొదలు)

**"ఏదో సర్ప్రైజ్** అని ఆఘ మేఘాల మీద ఈ వీకెండ్ నన్ను టాంప నుండి ఇక్కడ ప్యారిస్ కు రప్పించావు. ఇంతకీ సర్ప్రైజ్ ఎంటి?' లక్ష్మి ని అడిగాడు లారెన్స్.

"నన్ను ఇలా కలవడమే సర్ప్రైజ్ అనుకోవచ్చు కదా. నాకు దొరికిన ఈ కొత్త ప్రోజెక్ట్ కు డబ్బులు బాగానే వస్తున్నాయి. నిన్ను కలవాలనిపించింది, టికెట్ పంపించాను"

"అలాగా? సరే నువ్విచ్చిన ఈ సర్ప్రైజ్ బాగానే ఉంది."

"మరీ అలా నమ్మేస్తే ఎలా?" నవ్వింది లక్ష్మి.

"అస్సలు రాకూడదనే అనుకున్నాను. ఈ వారం టాంప లో మీ పేరెంట్స్ కలవాలని కదా మన ప్లాన్. నీకు ప్యారిస్ లో కొత్త ప్రోజెక్ట్, వెంటనే పోవాలని వచ్చేసావు. అదే పెద్ద సర్ప్రైజ్. నేను బాగా అప్సెట్ అయ్యాను."

"ఈ ప్రోజెక్ట్ అనుకోకుండా వచ్చింది. బ్యాంక్ ఎదో ఉపద్రవం లో ఉంది, ఎమర్జెన్సీ అని చెప్పారు. నేను తప్పక రావలసి వచ్చింది. సారీ. మొత్తం మీద మోనాలిసా చూసాం కదా, నీ అభిప్రాయమేమిటి?" లారెన్స్ ను అడిగింది లక్ష్మి, పక్కన షాప్ ల లోని వస్తువులు చూస్తూ.

సాయంత్రం అయ్యింది. ఇంకా వెలుగుంది. సూర్యాస్తమయం ఈఫిల్ టవర్ పైనుంచి చూడాలని లక్ష్మి ప్లాన్. లూవ్ మ్యూజియం చూసి లక్ష్మి, లారెన్స్ అక్కడున్న పురాతన భవనాల కారిడార్ లలో నడుస్తున్నారు. వరుసగా టూరిస్ట్ లకి ట్రింకెట్స్ అమ్మడానికి ప్రయత్నిస్తున్న చిల్లర దుకాణాలు ఉన్నాయి. లారెన్స్ చేతిలో పొద్దున్న అవసరంగా కొన్న గొడుగు. ఐ.ఎం.పే కట్టిన పిరమిడ్ ముందు, మ్యూజియం లో ప్రవేశానికి, ఒక అర గంట నిలవాల్సి వచ్చింది. పొద్దున్నే అంత జనం ఉన్నారు. వర్షం పడటం మొదలెట్టటం తో, అలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న కుర్రాళ్ళు మడత పెట్టగలిగే చిన్న చిన్న గొడుగులు నాలుగింత ధరలకు అమ్మసాగారు. లారెన్స్ వారిద్దరికని కొన్న గొడుగు అతని చేతిలో ఉంది.

" ఓవర్ రేటెడ్. వచ్చిన వారందరూ ఆ పెయింటింగ్ ఉన్న గదికి పరిగెత్తి, ఆ బొమ్మ ఫోటోలు తీయడం, వీలైతే ఆ గుంపులో నే సెల్ఫీ లు తీసుకోవడం, ఏదీ బాగా లేదు. పోరాటానికి ముందుండి ప్రజలను తీసుకెళ్ళు తున్న లిబర్టీ చిత్రం చూసి పొందినంత ఆనందం మోనాలిసా చిత్రం చూడటం లో నాకు లేదనిపించింది," అన్నాడు లారెన్స్.

"నాకూ అలానే అనిపించింది," అంటూ లక్ష్మి పక్కనున్న షాప్ లో ప్యారిస్ నగరం బొమ్మలున్న శాలువాలు రెండు కొని, ఒకటి తను కప్పుకొని, మరొకటి లారెన్స్ కి ఇచ్చింది. లారెన్స్ ఆ శాలువ మెడలో టై లాగా వదులు గా ముడి వేసి కట్టుకుంటే, ముచ్చట పడిపోయింది లక్ష్మి.

"పొద్దున్న కొన్న గొడుగు నా ట్రింకెట్ అనుకుంటా. మళ్ళీ ఈ శాలువ ఎందుకు?" అన్నాడు లారెన్స్.

"ఆ గొడుగు పొద్దున గాలికే ఊగిపోయింది. ఇంకో సారి వర్షంలో ఉపయోగ పడటం అనుమానమే. పడేయి"

"నేనూ పడేద్దామనుకున్న. కానీ పొద్దున గొడుగు కింద నువ్వు నన్ను హత్తు కున్న క్షణాలు గుర్తుకొచ్చి పెట్టేసుకున్నాను."

"సో రొమాంటిక్. కానీ ఈ నీలం రంగు శాలువ నీకు బాగా నప్పింది. శాలువ కూడా నీకు నచ్చి పెట్టుకోడానికి, ఇదిగో," అంటూ లక్ష్మి, శాలువ లారెన్స్ మెడ దగ్గర సవరిస్తూ, అతని బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టింది. సంతోషంతో, ఆశ్చర్య పడిన లారెన్స్ ను చూస్తూ "ఉబర్ బుక్ చేస్తాను ఈఫిల్ టవర్ చూడడానికి ప్లాన్ చేసాను. అక్కడే టవర్ పైన రెస్టారెంట్ లో కాఫీ తాగ వచ్చు. నువ్వు మరీ అలసిపోలేదు కదా," అంది లక్ష్మి.

లారెన్స్ లక్ష్మి చేతిలో చేయి వేసి మృదువుగా నొక్కుతూ," అబ్బే అదేం సమస్య కాదు లక్ష్మి. వీకెండ్ ట్రిప్ కదా. నిన్న శుక్ర వారం పని తరువాత ప్లేన్ ఎక్కాను. రాత్రి ప్లేన్ లో నిద్ర పోయాను. పొద్దున కంత నీ దగ్గర ఉన్నాను. నువ్వు రోజంతా కూడా బాగా ప్లాన్ చేసావు. ప్రతీ క్షణం బాగుంది. నీవెక్కడున్న, అక్కడ నాకు బాగుంటుంది లక్ష్మి," అన్నాడు.

"నిజానికి, నీ వల్లే ఈ ట్రిప్," అంది లక్ష్మి ఆగిన ఉబర్ కారులో అడుగు పెడుతూ, ఉబర్ డ్రైవర్ ను విష్ చేస్తూ.

"అదెలా?"

"నేను ఎఫ్ బి ఐ కి ప్రోజెక్ట్ లు చేయడం, అవన్నీ బాగా చేయడం వల్లే దీవల్లి బ్యాంక్ బోర్డ్ ద్వారా నాకు ఈ కొత్త ప్రోజెక్ట్ దొరికిందనుకుంటాను. దీవల్లి బ్యాంక్ తో నేను ఇది వరకే మరో పెద్ద కన్సల్టెన్సీ కంపనీ ద్వారా పని చేశాను. ఆ బ్యాంక్ చైర్మన్ లూయి తో నాకు ఇది వరకే పరిచయం ఉంది. ఫ్రాన్స్ లో గత మూడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన, పెద్ద బ్యాంక్ దీవల్లి. అందుకే ఒప్పుకున్నాను."

"నీ పనితనం వల్లే నీకు ఈ అవకాశం దొరికింది. నన్ను ఎలా కారణం అంటున్నావు?"

"నీ వల్లే కదా నేను ఎఫ్ బి ఐ కి పని చేస్తానని ఒప్పుకున్నది.'

"అలా నాకు క్రెడిట్ ఇస్తానంటే, వద్దనడం ఎందుకు? మొత్తం క్రెడిట్ నేనే తీసుకుంటాను లే," నవ్వేసాడు లారెన్స్.

ఉబర్ దిగగానే, ఎదురుగా, ఎత్తుగా ఉన్న ఈఫిల్ టవర్ చుట్టూ ఈగలు ముసిరి నట్లు జన సందోహం.

"నా దగ్గర 'స్కిప్ ది లైన్' టికెట్లు ఉన్నాయి," అంటూ లారెన్స్ చేయి పట్టుకొని లాక్కుంటూ టవర్ ముఖ ద్వారం వైపు దారి తీసింది లక్ష్మి .

"ఇందాక మాటలు దాటేసావు. ఇంతకీ నాకు మరో సర్ప్రైజ్ ఉందా, లేదా?"

"ఎం అనుకోకుండా, ఇలా ఈఫిల్ టవర్ ఎక్కడం సర్ప్రైజ్ కాదా?"

"అప్పుడప్పుడు నువ్వు ఏదో ఆలోచనల తో బ్లాంక్ అయ్యి పోతున్నావు. ఆ ఫోన్ లాగి చెక్ చేస్తున్నావు, టెక్స్ట్ చేస్తున్నావు. ఆర్ యు ఓ కే? పని గురించి అనుకుంటాను. ఇంతకీ నువ్వు పని చేస్తున్న ఈ దీవల్లి బ్యాంక్ సమస్య ఏంటో? ఆ ప్రశ్న నేను అడుగ వచ్చా?"

"అబ్బే నేను బాగానే ఉన్నాను. నిజానికి ఆమ్ సో ఎగ్జైటెడ్. ఇక బ్యాంక్ గురించి అంటావా? సమస్య ఎంటో పూర్తి వివరాలు రేపు నేను ఆ బ్యాంక్ పోయినప్పుడు తెలుస్తాయి. కానీ ఆ బ్యాంక్ ఏదో ఒక గొడవలో పడుతుందని నేను ముందే అనుకున్నాను. "

టవర్ పైకి పోవడానికి ఎలివేటర్ రావడంతో ఇద్దరూ మౌనం వహించారు. టవర్ పై నుంచి ప్యారిస్ నలు వైపులా చూసారు. ఒక పక్క సెక్రే కోర్ బెసిలిక, సేయిన్ నది లాంటివి కనపడితే, మరోవైపు దూరంగా ఉన్న ఆకాశ హర్మ్యాలు

కనపడ్డాయి. ఆ హర్మ్యాలు చూపిస్తూ, “ఆ కనపడేది లా డిఫెన్స్. నేను అక్కడికే వెళ్ళాలి. ఆ ప్రాంతంలో కార్పొరేట్ ఆఫీసు లు ఉన్నాయి,” అంది లక్ష్మి.

“దీవల్లి బ్యాంక్ గురించి మాట్లాడుతూ ఆపేసావు. ఆ బ్యాంక్ పని తీరు గురించి ఇది వరకే తెలుసన్నావు. అలా కాఫీ షాప్ లో కూర్చుని మాట్లాడు కుందామా,” అన్నాడు లారెన్స్.

“నన్ను కొననీయి. నీకు కోల్డ్ బ్రూ నే కదా,” అంటూ లక్ష్మి ఇద్దరికీ కాఫీ ఆర్డర్ చేసింది. అలానే రకరకాల పాస్టెల్ రంగులలో ఓరియో కూకీల లాగా ఉన్న మెకరో లను చూసి ఒక రెండు తీసుకుంది. ఇద్దరూ ఒక మూల ఉన్న హై టేబిల్, బార్ స్టూల్ లు ఉన్న చోట చేరో కాఫీ, మెకరో లతో బాటు కూర్చున్నారు.

“నేను ఈ కంపెనీ పెట్టక ముందు ఒక కన్సల్టింగ్ కంపెనీకి పని చేసేదాన్ని అని చెప్పాను కదా. అప్పుడు ఈ బ్యాంక్ పని తీరు పరిశీలించి, చూసిన లోటు పాట్ల తో బాటు అభివృద్ధికి సూచనలు ఇవ్వడం ఆ ప్రోజెక్ట్ పని.”

“అలాగా. మరి మీ రివ్యూ తరువాత ఇచ్చిన సూచనలతో, బ్యాంక్ గొడవలో పడకుండా ఉండాలి కదా. అలాంటిది ఈ బ్యాంక్, మీ రిపోర్ట్ చదివి మీరిచ్చిన సూచనలు అమలు చేసిన తరువాత కూడా, ఎలా గొడవలో పడి ఉంటుందని ఊహిస్తున్నావు?”

“నాకు ఆ బ్యాంక్ సి ఈ ఓ ఫిలిప్ పని తీరు మీద, అతని నేతృత్వంలో బ్యాంక్ సంస్కృతి లో వచ్చిన మార్పుల మీద అనుమానం. అతనిదో ఆల్ఫా మేల్ లాంటి పర్సనాలిటీ. తన మాటకు, నమ్మకాలకు అడ్డు వచ్చిన ప్రతీ వారిని దూరంగా ఉంచుతాడు, వీలైతే శిక్షిస్తాడు. అతని దగ్గర నిజాయతీగా పని చేసే వాళ్ళు తట్టుకోవడం కష్టమే.”

“మరి అలాంటి వాడు సి ఈ ఓ ఎలా అయ్యాడు?’

“బ్యాంకులకు కావలసినది లాభాలు, అభివృద్ధి. ఫిలిప్ ఆ రెండు బ్యాంక్ కు తెచ్చాడు.”

"మంచిదే కదా, తనకు, బ్యాంక్ కు?”

“ఫిలిప్ కు మంచిదే. బ్యాంక్ కు మంచిదా అన్నది సందేహమే.’

“ఎంటి? అలా అనేసావు?’

“లాభాలు కావాలని ఫిలిప్, బ్యాంక్ కొన్ని అడ్డ దారులు తొక్కినా పెద్దగా పట్టించుకొనే వాడు కాదు. బ్యాంక్ ఎక్కడెక్కడ పొరబాట్లు చేస్తున్నదో మా కన్సల్టింగ్ కంపనీ ద్వారా సోదాహరణంగా వివరించాము. ఏవి పట్టించుకోలేదు. పైగా మా ముందే మా పనిని తేలికగా ఎత్తి పారేస్తూ, ఏదో రూల్స్ ప్రకారం ప్రతీ ఏటా ఇలాంటి రిపోర్ట్ ఒకటి చేయించాలి కాబట్టి చేశానని, మా రిపోర్ట్ విప్పకుండానే పక్కన్నే పడేశాడు.”

"ఫిలిప్ తరువాత చదివి ఉండవచ్చు కదా?"

"అబ్బే నమ్మకం లేదు. మేము పని చేసిన నెల రోజులు, అతనిని, అతని పని తీరు కూడా పరిశీలించే అవకాశం వచ్చింది. వాళ్ళ ట్రేడింగ్ డిపార్ట్మెంట్ లో అవకతవకలు ఉన్నాయని, బ్యాంక్ నియంత్రించుకున్న నియమాలు కూడా ఉల్లంఘిస్తున్నారని చెప్తుండగనే, ఒక ట్రేడర్ ను పిలిపించి మాకు ఎంతో గర్వంగా పరిచయం చేశాడు. 'ఇదిగో మా స్టార్ ట్రేడర్ స్టీవ్. ఆయన వల్ల మా బ్యాంక్ కు మిలియన్స్ లాభం వచ్చింది. ఇందాక మీరు ఈయన డిపార్ట్మెంట్ మీద ఫిర్యాదు చేశారు. అది నేను నమ్మను.' అని ఫిలిప్ వెటకారంగా నవ్వి మాతో వీడ్కోలు తీసుకున్నాడు."

"ఫిలిప్ అలాంటి వాడు అయితే నిన్ను ఎందుకు పిలుస్తాడు?"

"అవును, అతను పిలవడు. ఈ సారి పిలిచింది బ్యాంక్ బోర్డ్. ఇక వాళ్ళు నన్ను పిలవడానికి కారణం నేను ఇది వరకు ఎఫ్ బి ఐ కు చేసిన ప్రాజెక్టులు. ఎఫ్ బి ఐ కి పని చేయడానికి కారణం నువ్వు!" లక్ష్మి నవ్వుతూ తన కాఫీ కప్ చీర్స్ అన్నట్లు పైకి ఎత్తింది, లారెన్స్ వైపు చిలిపిగా చూస్తూ.

"చీర్స్. నువ్వు ఆ బోర్డ్ ను కలుస్తున్నావు కదా. వివరాలు తెలిసిపోతాయి. నువ్వే పని మొదలు పెట్టినా ఆ పని సఫలంగానే ముగిస్తావు. ఇక రేపు మళ్లీ టాంపా కు వెళ్లి పోవాలంటే ఇప్పుడే దల్ గా ఉంది. థాంక్స్, ఈ సర్ప్రైజ్ కు. సమయం ఇట్టే గడిచిపోయింది."

"ఇంతకీ నేను సర్ప్రైజ్ ఏదో చెప్పనే లేదు"

లారెన్స్ ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు. ఇక చాలు, నీ ఆటలు అన్నట్టుంది. లక్ష్మి నవ్వేస్తూ

"సెయిన్ నది పైన క్రూయిజ్ డిన్నర్ కి రిజర్వ్ చేసాను. పద పోదాం," అంది, దిగడానికి కేటాయించిన ఎలివేటర్ వైపు దారి తీస్తూ.

లక్ష్మి , లారెన్స్ దిగి రోడ్డు దాటి సెయిన్ నదు ఒడ్డు దగ్గర నిలబడిన డిన్నర్ క్రూయిజ్ పడవ దగ్గర వెళ్ళగానే, అక్కడ ఉన్న జనం లో నుంచి ఒక నడి వయస్సులో ఉన్న జంట వీరి వైపు వచ్చింది. లక్ష్మి ఉన్నట్టుండి లారెన్స్ చేయి వదలి వారిద్దరినీ గట్టిగా కౌగిలించుకుంది.

" మీట్ మై పేరెంట్స్ విశ్వం, సీత. అమ్మా, నాన్న లారెన్స్," పరిచయాలు ముగించి లారెన్స్ ముఖం వైపు చిలిపిగా చూసింది.

"ఇది గొప్ప సర్ప్రైజ్. నాకు లక్ష్మి చెప్పనే లేదు, మీరు కూడా ప్యారిస్ లో ఉన్నారని. ఇలా కలవ బోతామని. మిమ్మల్ని కలవడం చాల ఆనందంగా ఉంది. మీకు ఒక అద్భుతమైన, అందమైన అమ్మాయి ఉంది," అన్నాడు లారెన్స్ వారికి హగ్ ఇస్తూ. తరువాత లక్ష్మి చేతిని ఇలా సర్ప్రైజ్ చేసినందుకు సన్నగా గిల్లుతూ.

" అవును డిన్నర్ క్రూయిజ్ లో మా అమ్మ, నాన్నలను కలవడమే నీకు సర్ప్రైజ్. మా అమ్మకు ఇందాక కాఫీ తాగుతూ, టెక్స్ట్ చేసాను. మనం దిగే సరికి వారు పడవ దగ్గరకు వచ్చి ఉండమని," అంది లక్షి .

టాంపా లో చాలా రోజుల తరువాత లారెన్స్ ను, లక్షి తన పేరెంట్స్ ఆ వీకెండ్ పరిచయం చేస్తానని, టార్పొన్ స్ప్రింగ్స్ లోని గ్రీక్ రెస్టారంట్ తో సహా అన్ని ఏర్పాట్లు చేసి, అకస్మాత్తు గా 'నేను ప్యారిస్ వెళ్ళా,' లని పెట్టే, బెడా లక్షి సర్దుకోవడం తో లారెన్స్ బాగానే అప్సెట్ అయ్యాడు. అస్సలు లక్షి ఈ రిలేషన్షిప్ సీరియస్ గానే తీసుకుంటున్న దా అన్న అనుమానం కూడా ఒక సారి మదిలో అలా వచ్చి పోయింది.

"మీ అమ్మ, నాన్నలను మొదటి సారి కలుస్తున్నాను అంటే సంతోషం, ఉత్సాహం తో పాటు కొంచెం నెర్వస్ గా కూడా ఉంది. నా డ్రెస్ బాగానే ఉంది కదా. నీకు మీ అమ్మా నాన్నల గురించి తెలుసు కదా, నాకు కొన్ని హింట్స్ ఇచ్చిందవచ్చు కదా, " లారెన్స్ లక్షి చెవిలో మెల్ల గా చెప్పాడు, అందరూ డిన్నర్ టేబుల్ వైపు నడుస్తుండగా.

"నీ కేమి. ఏ డ్రెస్ వేసినా బాగానే ఉంటావు. మా అమ్మ, నాన్న లు మంచి వారు. ఓపెన్ మైండ్ ఉన్న వారు. కాబట్టి నీవు మామూలుగానే ఉండు. తెగ నచ్చి పోతావు."

"నేను మాట్లాడేటప్పుడు జాగ్రత్తల గురించి చెప్పు. నాకు మొదటి కలయికలోనే పొరబాట్లు చేయడం ఇష్టం ఉండదు."

"మా అమ్మకు కొంచెం చాదస్తం అని ముందే చెప్పాను కదా. హిందూ సంప్రదాయం, సంస్కారం మాటల మధ్యలో తెస్తుందేమో. మనిద్దరికీ దేవుడంటే పెద్ద పట్టింపు లేదు. నేను గుడికి పోను, నువ్వు చర్చ కి పోవు. అయినా, మొదటి సారి కలుస్తున్నాము. పరిచయాలు, ప్లెసెంటరీ లతో సరిపోతుంది," అంటూ లక్షి , లారెన్స్ భుజం ను నొక్కింది.

డిన్నర్ టేబిల్ దగ్గర సంభాషణ లు సులభంగానే దొర్లాయి. లారెన్స్ గురించి అంతకు ముందే లక్షి , సీత విశ్వం లకు చెప్పి ఉండడం వల్ల, అలానే లారెన్స్ కు తన పేరెంట్స్ గురించి చెప్పడం వల్ల ఎవరికి ఏదీ కొత్త అనిపించలేదు. విశ్వం, సీత లు మరో వారం యూరోప్ లోనే గడుపు తామని చెప్పారు. లారెన్స్ చేస్తున్న పని గురించి, అతని చిన్న తనం, కుటుంబం గురించి మాట్లాడుతూ, దారిలో నది పక్కన కనిపిస్తున్నా నొత్ర డాం చర్చ్, ఆర్ సే మ్యూజియం లాంటి కట్టడాలు చూసి గుర్తిస్తూ, బేరర్ లు వడ్డిస్తున్న వంటలు తింటుంటే, సమయం ఇట్టే గడిచి పోయింది.

క్రూయిజ్ తరువాత పడవ ఎక్కిన చోటికే తిరిగి రావడంతో సీత, విశ్వంలు లారెన్స్ ను టార్పొన్ స్ప్రింగ్స్ లో ఉన్న తమ ఇంటికి వస్తూ ఉండమని, అలానే లారెన్స్ తల్లి తండ్రులను కూడా వీలు చూసుకొని పరిచయం చేయమని, హగ్ చేసి వీడ్కోలు తీసుకున్నారు. లక్షి కూడా తను లారెన్స్ తో కలిసి మరి కొంత సమయం సెయిన్ నది ప్రాంతంలోనే గడిపి హోటల్ కు వస్తానని వీడ్కోలు తీసుకుంది. లక్షి , లారెన్స్ ఇద్దరూ విశ్వం, సీతలను ఉబర్ ఎక్కించి తిరిగి నడవటం మొదలెట్టారు.

"మీ పేరెంట్స్ నాకు బాగా నచ్చారు లక్షి . దే అర్ సో స్వీట్," అన్నాడు లారెన్స్.

"నువ్వు కూడా మా వాళ్లకు నచ్చావు అనుకుంటా. మా నాన్న గురించి నాకు ఎలాంటి సందేహం లేదు. నాకు ఎవరు నచ్చినా, అతను తనకు నచ్చి నట్లే. అమ్మా గురించే భయం ఉంది. తను కాదంటే కూడా, నేను వెనుకాడే దాన్ని కాదు. కానీ తనకు కూడా నచ్చావు అని మా అమ్మ కళ్ళతోనే తెలిసి పోయింది. నీ దగ్గర ఆ మాత్రం చార్మ్ లేకపోతే నేనూ పడేదాన్ని కాదు కదా," నవ్వింది లక్షి .

లారెన్స్ ఫ్లైట్ తీసుకుని, తిరిగి టాంపా వెళ్ళిపోయాడు. లక్షి ఎయిర్పోర్ట్ కు లారెన్స్ తో వెళ్లి డ్రాప్ చేసి వచ్చింది. తరువాత అమ్మ, నాన్నలు తమంటే తామే తిరుగుతా మన్నారు. వారు తను కాలేజీ చేరినప్పటి నుంచి చిలక, గోరింక ల లాగా ప్రపంచమంతా తిరగేసారు. ప్యారిస్ వారికి కొత్తేమీ కాదు.

లక్షి ఉబర్ తీసుకుని లా డిఫెన్స్ ప్రాంతంలో ఉన్న దీవల్లి బ్యాంక్ కు పోయింది. ఈ బ్యాంక్ హెడ్ ఆఫీస్ ఇది వరకు రెండు వందల ఏళ్ల క్రితం రాజ భవంతి లా కట్టిన పాత మేడలో ఉండేది. ఫిలిప్, సీ ఈ ఓ అయ్యాక, అక్కడున్న ఆకాశ హర్మ్యల కు ధీటుగా కొత్త హెడ్ ఆఫీస్ కట్టించాడు. నలభై ఐదో అంతస్తు లో ఉన్న ఎక్జిక్యూటివ్ ఫ్లోర్ లోని కాన్ఫరెన్స్ రూం లో మీటింగ్ ఉంది, లక్షి కి. మీటింగ్ కు రావలసినది లక్షి కాక మరో ముగ్గురే. అందులో ఒకరు ఫిలిప్, మిగిలిన ఇద్దరు ఆ బ్యాంక్ బోర్డ్ ఆడిట్ కమిటీ మెంబర్ లు.

నలుగురికి ఆ రూము కొంచెం పెద్దదే. ఫిలిప్ రూం పెద్దది. అక్కడే కలిసి ఉండవచ్చు. కానీ బహుశా బోర్డ్ మెంబర్ లకు ఫిలిప్ రూం లో కలవడం ఇష్టం లేదేమో అనుకుంది లక్షి .

తను రూము ప్రవేశించే సరికే, ఫిలిప్ అక్కడ కూర్చొని ఉండడం చూసి లక్షి ఆశ్చర్య పడింది. లక్షి ఫిలిప్ కు గుడ్ మార్నింగ్ చెప్పి నవ్వుతూ పలుకరిస్తే, ఫిలిప్ తల కూడా ఎత్తకుండా గుడ్ మార్నింగ్ చెప్పి సంభాషణ ముందుకు పోకుండా త్రుంచేసాడు. లక్షి కి ఇదివరకు చూసిన ఫిలిప్ కు, ఇప్పుడు చూస్తున్న ఫిలిప్ కు చాలా తేడాలు కనిపించాయి. ఇది వరకు పొగరుగా, ఈ బ్యాంక్ రాజ్యానికి ఎదురులేని చక్రవర్తి లాగా, బాగా వెటకారం తో మిళితమైన మాటలు విసిరే ఫిలిప్, ఇప్పుడు ముభావంగా తనతో చూపులు కూడా కలపకుండా తను ఆ రూం లోనే లేనట్లు ప్రవర్తిస్తున్నాడు. రావలసిన మిగిలిన ఇద్దరు బోర్డ్ మెంబర్ లు రూం కు రావడంతో లక్షి కి ఉపశమనము కలిగింది.

ఆ వచ్చిన బోర్డ్ మెంబర్లలో లూయి సీనియర్, ఆ బ్యాంక్ చైర్మన్. అతడే మీటింగ్ మొదలెట్టాడు.

"వెల్కమ్ లక్షి . మీరు ఇది వరకే మేకిన్సీ కన్సల్టెంట్ గా పని చేసి, మాకు ఒక రిపోర్ట్ ఇచ్చారు," అన్నాడు లూయి.

"అవును అప్పుడు బ్యాంక్ లో ఉన్న కంట్రోల్స్ రివ్యూ చేసి, చూసిన లోటుపాట్లు, మెరుగు పరచడానికి సూచనలు మా రిపోర్ట్ లో ఇచ్చాము," అంది లక్షి .

“మా సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ది ఫ్రాన్స్ అలాంటి రివ్యూ ఒకటి చేయమని బ్యాంక్ కు ఆదేశమిచ్చింది. అందుకే ఫిలిప్ ఆ రివ్యూ చేయించాడు. మీరు రిపోర్ట్ ఇచ్చారు,” అంటూ ఫిలిప్ వైపు తిరిగి, “ఫిలిప్, ఆ రిపోర్ట్ ను గతం లో బోర్డ్ కి సమర్పించి నప్పుడు పెద్దగా విలువ లేదన్నావు కదా?”

“అవును. ఇప్పటికీ నా అభిప్రాయం అదే. ఆపరేషన్స్ లో అనేక సమస్యలు పుట్టుకొస్తుంటాయి. మిలియన్స్ ల లో లాభం వచ్చే అవకాశాలు ఎదురై నప్పుడు, ఏవో ఒకటి రెండు కంట్రోల్స్ తప్పి పోవచ్చు. ముందు బ్యాంక్ కు లాభం చేకూర్చడం ముఖ్యం. ఈ కంట్రోల్స్ మనం నింపాదిగా సరి చేసుకోవచ్చు,” అన్నాడు ఫిలిప్.

“ఫిలిప్, నువ్వు బోర్డు లో కూడా ఇదే మాట అన్నావు. బోర్డ్ లో నేను, ఇతరులు కూడా అది ఆమోదించలేదు. అన్ని కంట్రోల్స్ ఉండాలని, వాటి పరిమితిలో నే పని చేయాలని చెప్పాము. దాని తరువాత జరిగిన బ్యాంక్ ది ఫ్రాన్స్ ఇన్స్పెక్షన్ లో ఆ లోటుపాట్లను సరిదిద్ద లేదని, మన బ్యాంక్ పైన పెద్ద మొత్తంలోనే ఫైన్ కూడా వేశారు.”

“ఆ ఫైన్ మనం కాస్ట్ ఆఫ్ రెగ్యులేషన్ అనుకుంటే, ఆ ఫైన్ కు ఎన్నోరెట్లు పైన లాభాలు తెచ్చి పెట్టాను,” అన్నాడు ఫిలిప్.

“లక్ష్మి ఆ రిపోర్ట్ తరువాత, ఆ రిపోర్ట్ లో చూపిన సమస్యలు సరి చేయడానికి, మళ్లీ మరో కన్సల్టింగ్ కంపనీ కి కాంట్రాక్ట్ ఇచ్చాము. అది పెద్ద పనే. ఆ పని మీ లాంటి బోటీక్ కంపెనీలకు ఇవ్వలేము. కానీ మాకు మా సింగపూర్ ఆఫీస్ లో అవకతవకల గురించి నీవు ఇది వరకే మరో కన్సల్టెన్సీ కి పనిచేస్తున్నప్పుడు చెప్పావని తెలిసింది. ఇప్పుడు ఆ ఆఫీస్ ను రివ్యూ చేస్తే మాత్రం చాలు. మాకు రిపోర్ట్ ఒక రెండు వారాలలో కావాలి.”

లక్ష్మి కి గతంలో ఫిలిప్, స్టీవ్ ను సింగపూర్ స్టార్ ట్రేడర్ గా గర్వంగా పరిచయం చేయడం, తన రిపోర్ట్ ను హేళన చేయడం గుర్తుకు వచ్చింది.

ఫిలిప్ గొంతు సవరించుకుని, “పొద్దున్నే నాకు సింగపూర్ నుంచి మెసేజ్ వచ్చింది,” అన్నాడు.

“ఏమి మెసేజ్, ఎవరు పంపించారు?” అడిగాడు లూయి.

“స్టీవ్ పంపించాడు. అర్థా పర్థం లేని మెసేజ్. ‘ నేను చేసిన పనులకు క్షమించండి. నేను బ్యాంక్ పని వదిలేస్తున్నాను ‘ అంతే ఒక చిన్న రెండు వాక్యాల మెయిల్,” అన్నాడు ఫిలిప్

లక్ష్మి కి ఆ స్టీవ్ తనముందు ఫిలిప్ ఇదివరకు పొగిడిన ట్రేడర్ అని అర్థం అయ్యింది. ఫిలిప్ ముఖంలో ఏదో ఆందోళన, భయం ఇక క్షణం కనిపించి మాయమైనదని పించింది.

“స్టీవ్ మీద మీకు అనుమానం ఉందా?” అడిగింది లక్ష్మి .

"అబ్బే. స్టీవ్ స్టార్ ట్రేడర్. బ్యాంక్ కు చాలా లాభాలు తెచ్చాడు. ట్రేడర్ పని చాల టెన్షన్ తో కూడిన పని. ఇవ్వాళ వచ్చిన ఉత్తరం బర్న్ ఔట్ వల్ల కావచ్చు," అన్నాడు ఫిలిప్ వెంటనే.

"స్టీవ్ చేస్తున్న పని తీరు వల్ల సింగపూర్ ఆఫీస్ పని మీద బోర్డ్ కు అనుమానాలు ఉన్నాయి," లూయిా అదే సమయంలో అన్నాడు.

ఫిలిప్ కి బోర్డ్ తో పడటం లేదని లక్ష్మి అర్థం అయ్యింది. ఇది కొత్త పరిణామం. ఇదివరకు బ్యాంక్ ను కన్సల్టెంట్ గా రివ్యూ చేసినప్పుడు, ఫిలిప్ నేతృత్వం కింద బ్యాంక్ వేస్తున్న ముందడుగులు చూసి, బ్యాంక్ బోర్డ్ కొంచెం ఫిలిప్ కి జంకేది అనిపించింది లక్ష్మి కి. కానీ ఇప్పుడు బోర్డ్ ది పై చేయి లాగా కనిపిస్తున్నది. ఫిలిప్ పని చేస్తున్న తీరులో ఏదో తేడా వచ్చి ఉండాలి. ఫిలిప్ అంత త్వరగా తన అధికారం, దానితో వచ్చిన గర్వం వదులుకొనే మనిషి కాదు.

"నాకు సింగపూర్ ఆఫీస్ పనులు రివ్యూ చేయడానికి కావలసిన ఏర్పాట్లు చేయండి. నేను ఈ రోజు ఆ పని మీదనే ఉంటాను. ఫిలిప్ కు, బోర్డ్ కు నా పని ప్రగతి గురించి ప్రతి రోజు స్టేటస్ రిపోర్ట్ ద్వారా తెలుపుతాను. మీరడిగినట్లే రెండు వారాలలో పని ముగించడానికి ప్రయత్నిస్తాను," అని చెప్పడంతో ఆ మీటింగ్ ముగిసింది.

ఫిలిప్, లక్ష్మి తో బాటు నడుస్తూ, "నీ పనికి నా రూం ఉన్న ఫ్లోర్ లోనే ఒక రూం కేటాయించమని చెప్పాను. నీ తో పనిచేయడానికి మేరీ ని పంపిస్తున్నాను. మేరీ నా పర్సనల్ స్టాఫ్ టీమ్ లో పనిచేస్తుంది. చలాకి పిల్ల. నీకు కావలసిన ఏర్పాట్లు అన్నీ చేస్తుంది. నీకే సందేహాలు ఉన్న నా ఆఫీస్ తెరిచే ఉంటుంది," అని చెప్పాడు.

ఫిలిప్ పని చేస్తున్నది, బోర్డ్ కింద ఫ్లోర్. వారు మెట్లు దిగి ఆ ఫ్లోర్ చేరగానే ఫిలిప్ చెప్పిన మేరీ ఎదురు రావడంతో, ఫిలిప్ వారిద్దరికీ పరిచయం చేసి, తన ఆఫీస్ రూం కు వెళ్ళిపోయాడు. రూం అనడం కంటే అపార్ట్మెంట్ అనొచ్చు నేమో. అన్ని సదుపాయాలు ఉన్నాయి ఫిలిప్ కు.

మేరీ చలాకి పిల్ల. ఏదో పెద్ద పేరున్న మేనేజ్మెంట్ స్కూల్ క్యాంపస్ రిక్రూట్మెంట్ లో మంచి ఆఫర్ ఇచ్చి ఏరికోరి బ్యాంక్ లో చేర్చుకున్న యువ ఎక్జిక్యూటివ్.

"ఫిలిప్ ఇందాకనే టెక్స్ట్ చేశారు. మీరు బ్యాంక్ సిస్టమ్ లను లాగ్ చేయడానికి ఇది వరకే ఏర్పాట్లు చేసాము. ఈ ఎన్వలప్ లో మీ లాగ్ చేయడానికి కావలసిన వివరాలు ఉన్నాయి. సింగపూర్ ఆఫీస్ రికార్డులు చూడడానికి కూడా ఏర్పాట్లు చేసాను. మీ కు ఎదైన అవసరం వస్తే, నాకు ఆఫీస్ మెసెంజర్ పైన పింగ్ చేయండి. నేనూ ఈ ఫ్లోర్ లోనే పని చేస్తున్నాను. వెంటనే మీ దగ్గరకు వస్తాను," అంది మేరీ.

"మేరీ థాంక్స్. ఒక ఐదు నిమిషాలు కూర్చో. నేను బ్యాంకు సిస్టమ్ లాగ్ ఇన్ అయ్యి, నాకు కావలసిన రికార్డులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఒక సారి చూస్తాను. ఇంతకీ ఈ సింగపూర్ ఆఫీస్ గురించి నీకేమి తెలుసు?" అడిగింది లక్ష్మి .

"నేను ఈ బ్యాంక్ చేరి నాలుగేళ్లు అయ్యింది. గత మూడు ఏళ్లు ఫిలిప్ స్టాఫ్ లోనే మెంబర్. సింగపూర్ ఆఫీస్ మా బ్యాంక్ కు మంచి లాభాలే తెచ్చి పెడుతుందని విన్నాను. మా బ్యాంకు మొత్తం ఆసియా వ్యాపార లావా దేవీలు సింగపూర్ ఆఫీస్ ద్వారా జరుగు తాయి. ఆ ఆఫీస్ లో పని చేసే మా స్టార్ ట్రేడర్ స్టీవ్ గురించి వినే ఉంటారు," గల గల మాట్లాడింది మేరీ.

స్టీవ్ ఉద్యోగం వదలి పారిపోయిన విషయం ఇంకా మేరీ కి తెలియదు అని లక్ష్మి కి అర్థం అయ్యింది. ఫిలిప్ కి ఇంకా స్టీవ్ మీద నమ్మకం ఉండి ఉండాలి. స్టీవ్ ఫిలిప్ ప్రియ శిష్యుడు, పెట్ కాబట్టి, అతనితో తను మాట్లాడి, అతను పంపిన రాజీనామాను వెనక్కు తీసుకునేటట్లు చేయగలనన్న నమ్మకం కూడా ఉండి ఉండాలి.

"నేను లాగిన్ కాగలిగాను. సింగపూర్ ఆఫీస్ డేటా కూడా చూడ గలుగుతున్నాను. ఆ స్టీవ్ గురించి నేను చాలా విన్నాను. నాకు అసరమైతే పింగ్ చేస్తాను. థాంక్స్," అని మేరీ దగ్గర వీడ్కోలు తీసుకుంది.

లక్ష్మి కి, తను అనుమానిస్తున్న బోర్డుకు, సి ఈ ఓ కు ఉన్న అసఖ్యం, స్టీవ్ పని తీరులను గురించి మేరీని అడుగుదామనుకుంది కానీ, అది మొదటి పరిచయం లోనే చేయడం సరి కాదనిపించింది.

లక్ష్మి ఆ రోజంతా బ్యాంక్ లావాదేవీలు, అదీ సింగపూర్ ఆఫీస్ ద్వారా జరిగిన లావా దేవీలను క్షుణ్ణంగా పరిశీలించింది. స్టేటస్ రిపోర్ట్ చేసే ముందు ఫిలిప్ ను ఒక సారి కలవాలని కబురు పెట్టింది.

ఫిలిప్ ను కలవడానికి ఎవరో వచ్చి నట్లు ఉంది. ఫిలిప్ ఆ మీటింగ్ తొందరగానే ముగించి, తన రూం బయటకు వచ్చి, రూం బయట వేసిన సోఫాలో కూర్చున్న లక్ష్మి తో కళ్ళు కలిపి, " రా లక్ష్మి . ఎంటి కలవాలన్నావట," అంటూ లక్ష్మి ని తన వెంట రూం లోపలకి తీసుకెళ్ళాడు. రూం పెద్ద బ్యాంక్ లలో సీ ఈ ఓ రూం ల లాగానే విలాసవంతంగా ఉంది. ఒక పక్క ఫిలిప్ పని చేసుకోవడానికి పురాతన నగిషీలు చెక్కిన టేబిల్ ఉంటే, మారో పక్క డ్రాయింగ్ రూం లాగా మెత్తటి సోఫాలు ఉన్నాయి. కొన్ని సోఫాలు పది మంది కూర్చొని సంభాషించే విధంగా ఏర్పాటు చేసి ఉంటే, మరో వైపు ఇద్దరు, ముగ్గురు మాత్రం కూర్చుండి మాట్లాడుకొనే ఇంటిమేట్ సెట్టింగ్ లాగా వేసారు. రూం లో అక్కడక్కడ వేస్ లలో ఫ్రెష్ ఫ్లవర్స్, రూం డెకర్, ఎవరో ఇంటీరియర్ డిజైనర్ బాగానే డబ్బు చేసుకున్న ప్రోజెక్ట్ లాగా ఉంది.

ఫిలిప్ లక్ష్మి తో ఇద్దరు ముగ్గురు కూర్చో గలిగె సోఫా సెట్టింగ్ వైపు దారి తీసాడు.

"లక్ష్మి , నీకు కావలసిన సదుపాయాలు అన్నీ దొరికాయి కదా? ఏంటి కలవాలన్నావు?" అన్నాడు ఫిలిప్.

“మీరడిగిన సింగపూర్ ఆఫీస్ వ్యవహారాలు చూసాను. రెండు విషయాలు మాట్లాడాలి.”

“చెప్పు”

“మొదటిది, స్టీవ్ మేనేజ్ చేస్తున్న ట్రేడింగ్ డెస్క్.”

“స్టీవ్ మా బ్యాంక్ స్టార్ ట్రేడర్. అతను తెచ్చినట్లు లాభాలు మరే విభాగం, ఇంత వరకు తేలేదు. పోయిన సారి నీకు స్టీవ్ ను పరిచయం చేశాను కూడా. అకస్మాత్తు గా రాజీ నామ చేశాడు. అతనిని ఆ రాజీనామా వెనక్కు తీసుకోమని చెప్పాలని ప్రయత్నిస్తున్నాను. దొరకటం లేదు.”

“అతను చేసిన రాజీనామా, నాకు మరిన్ని అనుమానాలు కలిగిస్తున్నాయి. తను సింగపూర్ లో చేస్తున్న పనిలో చాలా రెడ్ ఫ్లాగ్స్ కనిపించాయి.”

“అలానా. ఏవి, కొన్ని చెప్పు,” ఫిలిప్ గొంతు లో మొదటి సారి అనుమానం, భయం తో ఉన్న ఒక విరుపు వినపడింది.

స్టీవ్ చేస్తున్న పని గురించి, ఫిలిప్ కు ఎంత తెలుసు? తెలిసీ, బ్యాంక్ కు లాభాలు చేకూరుస్తున్నాడని చూసి, చూడ నట్లు ఉన్నాడా? ఆస్ట్రిచ్ పక్షి లా ఇసుకలో తల దూర్చేసాడా? లక్ష్మి మనస్సులో ఆలోచనలను అదుపులో పెట్టి “స్టీవ్ కు కావలసిన దానికన్నా ఎక్కు వ అధికారాలు ఇచ్చారు. బ్యాంక్ నియమాల ప్రకారం కూడా అది సరి కాదు.’

“స్టీవ్ చాలా టాలెంట్ ఉన్న అధికారి. అతనిలా ఆలోచించే వారు తక్కువ. అందుకే సింగపూర్ లో తన పై ఉన్న అధికారులు తన పనిలో తరచూ అడ్డుపడుతున్నారు, బ్యాంక్ కు లాభం తెచ్చే ట్రేడింగ్ చేయనివ్వటం లేదంటే, నేనే స్టీవ్ కి ప్రమోషన్ ఇచ్చి నా ఆఫీస్ కు డైరెక్ట్ గా రిపోర్ట్ చేయమన్నాను.”

“అతని ప్రమోషన్, మీకు డైరెక్ట్ గా పని చేయడం కాదు సమస్య.”

“మరి?”

“స్టీవ్ పని చేస్తున్నది ట్రేడింగ్ డెస్క్ మీద. అంటే అతను బ్యాంక్ తరపున స్టాక్ ఎక్స్చేంజ్ లలో మిలియన్స్ కొద్ది, బ్యాంక్ అవసరాల బట్టి వ్యాపారం చేయ వచ్చు. ‘

“అవును. అది కరెక్టే.’

“కానీ ట్రేడింగ్ డెస్క్ లో పని చేసేవారికి, బ్యాక్ ఆఫీస్ లో ఆ వ్యాపారం బ్యాంక్ అకౌంట్ పుస్తకాలలో ఎక్కించే వారికి సంబంధం ఉండకూడదన్నది అన్ని బ్యాంక్ లలో ఉండే నియమమే కదా.’

“అవును. సెపరేషన్ ఆఫ్ పవర్స్. రిస్క్ మేనేజ్ చేయడానికి అది అవసరమే.”

“మరి స్టీవ్ విషయం లో ఎందుకు అమలు చేయ లేదు. స్టీవ్ అటు స్టాక్ ఎక్స్చేంజ్ లలో డీల్స్ చేస్తున్నాడు, అవే చేతులతో బ్యాక్ ఆఫీస్ లో బ్యాంక్ అకౌంట్లు కూడా తనే రాస్తున్నాడు. “

"అలా చేసి ఉండికూడదే. ఏదైనా అర్జెంట్ అంటూ, అలా కొన్ని సార్లు చేసాడేమో. అలా చేసినా, వెంటనే బ్యాక్ ఆఫీస్ వారితో మాట్లాడి అవి వారి అనుమతితో సరి చేసి ఉండవచ్చు కదా?"

"అసలు బ్యాక్ ఆఫీస్ అధికార్లు లేకుంటే? ట్రేడింగ్ డెస్క్, బ్యాక్ ఆఫీస్ రెండూ స్టీవ్ నే నడిపిస్తున్నాడు. ఇలాంటి ఇంటర్నల్ కంట్రోల్స్ సమస్యలు నేను ఇది వరకు మేకిన్స్ సీ కి పనిచేస్తున్నప్పుడు, మీ బ్యాంక్ రివ్యూ లో చూసి, వ్రాసాను. బ్యాంక్ ది ఫ్రాన్స్ కూడా వాళ్ళ ఎగ్జామినేషన్లో ఈ లోటు పాట్ల గురించి వ్రాశారు అని ఈ రోజు మీ రిపోర్ట్ లలో చదివాను."

"పెద్ద సీరియస్ విషయం కాక పోవచ్చు. ఇంత వరకు స్టీవ్ విభాగం, సింగపూర్ ఆఫీస్ నుంచి విపరీతమైన లాభాలు వచ్చాయి," అన్నాడు ఫిలిప్. ఫిలిప్ గొంతులో సంశయం, భయం ఈ సారి స్పష్టంగా వినిపించింది లక్ష్మి కి.

"సింగపూర్ ఆఫీస్ రికార్డులు చూసాను. కొన్ని మిలియన్ ల విలువ గల ట్రేడ్స్ ఆచూకీ తెలియటం లేదు. ట్రేడ్స్ చేసినట్లు ఆ స్టాక్ ఎక్స్చేంజ్ ల నుంచి వచ్చిన అకౌంట్ల పరిశీలనలో తెలుస్తున్నది. కానీ ఆ ట్రేడ్స్ బ్యాక్ ఆఫీస్ లో కనపడటం లేదు. స్టీవ్ కు ఫోన్ చేసి మాట్లాడు దామనుకుంటే, అతను రిజైన్ చేసి వెళ్ళిపోయాడని పొద్దున మీటింగ్ లో మీరే చెప్పారు "

"మరి నీ ప్లాన్, రికమెండేషన్ ఎంటి?"

"సింగపూర్ ఆఫీస్ రికార్డులు చూసాను. నాకు వచ్చిన ప్రశ్నలకు, సమాధానాలు ఇక్కడ దొరుకేటట్లు లేదు. సింగపూర్ పోయి అక్కడ వారితో మాట్లాడి, మళ్లీ ఒక సారి రికార్డులు పరిశీలిస్తే, ఈ సమస్యకు పరిష్కారం దొరకొచ్చనిపిస్తోంది."

"అంటే సింగపూర్ పోవాలంటావా?"

"అవును. అదే నా రెండు ప్రశ్నకు దారి తీస్తుంది. బ్యాంక్ అనుమతిస్తే, నేను సింగపూర్ రేపే వెళ్తాను. అలానే నా ఆఫీస్ లో నాకు పనిచేస్తున్న ఆయేష ప్రస్తుతం ఇండియాలో ఉంది. తనని కూడా సింగపూర్ కి పిలుపిస్తాను. సరేనా?"

"సరే," అన్నాడు ఫిలిప్.

లక్ష్మి ఆ రోజు పని పూర్తి చేసుకొని హోటల్ రూం చేరుకుంది. వెంటనే తన కంపనీ కి పని వేస్తున్న ఆయేష కు ఫోన్ చేసింది.

"ఆయేష ఎలా ఉన్నావు. పడుకున్నావా?" అడిగింది లక్ష్మి .

" పడుకో బోతున్న. రాత్రి పదిన్నర అయ్యింది."

"గ్రేట్, నీవు ఇండియాకు పోయిన పనులు ఏమయ్యాయి?"

"మామూలే. అన్న సలీం ఇంకా ఆ పీర్ గ్రూప్ హాస్పిటల్స్ కి పని చేస్తున్నాడు. నసగడం కూడా అలానే ఉంది. వేరే ఉద్యోగం వెదుక్కోమంటే వినడు. అమ్మ ఆరోగ్యం అంతంత మాత్రమే ఉంది. డాక్టర్ కి చూపెట్టుకో మంటే వినదు."

"అది తెలిసిందే కదా. నా ప్రశ్న దాట వేస్తున్నావు. నువ్వు ఇండియా కు పోయింది అరసు కలవడానికి కూడా కదా. అదేమయ్యింది?"

"అబ్బే దాటేయటం లేదు. కానీ నేను మా అమ్మ కోసమే వచ్చాను. అరసు కొత్త ఫ్యాక్టరీ ఆరంభానికి నన్ను కూడా పిలవడం నిజమే. కానీ, అంత ప్లాన్ చేసి, అరసు ఫంక్షన్ కి నేను సమయానికి రాలేక పోయాను."

"నువ్వెంత దాచాలని ప్రయత్నించినా, నీకు అరసు మీదున్న క్రష్ నాకు తెలుసు. అసలు అరసు మీదున్న ఆ ప్రేమ వల్లే నీవు ఎక్కడా స్థిర పడ లేక పోతున్నావు. ఎన్రికో తో నువ్వు బ్రేక్ అప్ అయ్యింది దాని వల్లే. ముందే బయలు దేరావు కదా. ఇండియాకి పోవడానికి ఆలస్యం ఎందుకయ్యింది?"

"ఇండియా పోయిన ప్రతీ సారి, మధ్యలో ఏదో ఒక దేశం లో నాలుగైదు రోజులు బ్రేక్ తీసుకుంటాను. ఈ సారి జపాన్ లో ఆగి అక్కడే ఇరుక్కు పోయాను."

"ఏమయ్యింది?"

"నేనున్నప్పుడే అక్కడి కీయోటో నగరంలో భూకంపం వచ్చింది. అదృష్టవశాత్తు నాకేమీ ప్రమాదం జరుగక పోయినా, నా ఇండియా ఫ్లైట్ కేన్సిల్ అయ్యింది. తరువాతి ఫ్లైట్ తీసుకొని ఇండియా చేరే సరికి, అరసు ఫంక్షన్ అయిపోయింది."

"మళ్లీ అరసును కలిసి ఉండవచ్చు కదా?"

"కలిశాను. కానీ ఎందుకో ఇంతకు ముందు కనెక్షన్ పోయుందనిపిస్తుంది."

"అరసు కూడా నీతో బ్రేక్ అప్ అయ్యిన తరువాత ఇంకా సింగిల్ గానే ఉన్నాడన్నావు. మీరిద్దరూ కలిసి మరి సారి మనసు విప్పి మాట్లాడితే సరి పోతుంది. కానీ నీకు అలా మళ్లీ వెనక్కి వెళ్ళాలనే ఆలోచన ఉందో, లేదో తెలియదు. నీకు ఆ క్లారిటీ వస్తే, సమస్య ఉండదనుకుంటా. ఆలోచించి నిర్ణయం తీసుకో. ఇంతకీ నిన్ను పిలిచింది, నీవు ఈ వీకెండ్ అమెరికా కు బయలు దేరు తున్నావు కదా. సింగపూర్ లో పని బడింది. బ్రేక్ తేసుకోగలవా. నీ ట్రిప్ ఖర్చు మన కంపనీ అకౌంట్ లో వేస్తాను."

"అమెరికా వారాంతం లో చేరినా, మధ్య కంబోడియాలో రెండు రోజులు ఆగుదామనుకున్నాను. పరవాలేదు, ఆ ట్రిప్ కేన్సిల్ చేసి, సింగపూర్ మీదుగా మరో టికెట్ కొంటాను. ఎన్ని రోజులు సింగపూర్ లో?"

"నీవు రేపు బయలుదేరుతే, బుధవారం మనం పని మొదలు పెట్టొచ్చు. నేను కూడా ఆ సమయానికి అక్కడ ఉంటాను. ఇద్దరం ఉన్నాము కాబట్టి, నా ఉద్దేశంలో ఒక మూడు రోజులలో పని ముగించేయ వచ్చు. వచ్చే వారానికల్ల మళ్లీ మనిద్దరం తిరిగి అమెరికా చేరిపోవచ్చు. ఎందుకైనా మంచిది సింగపూర్ నుంచి టాంపా కు ఓపెన్ టికెట్ కొను. మనం అక్కడ పని బట్టి టికెట్ మార్చుకోవచ్చు."

"సరే. ఇప్పుడే నాకు తెలిసిన ట్రావెల్ ఏజెంట్ కు ఫోన్ చేస్తాను. పొద్దున కంతా టికెట్ డెలివర్ చేస్తాడు. సింగపూర్ లో కలుద్దాం. దీవల్లి బ్యాంక్ ప్రోజెక్ట్ అని తెలుసు. పూరి వివరాలు పంపిస్తే, నేను రేపు ప్రయాణంలో చదివేస్తా," అంది ఆయేష.

లక్షి కి ఆయేష లో అదే లక్షణం తెగ నచ్చుతుంది. ఎప్పుడు పనిలో ఒకడుగు ముందే ఉంటుంది. "ఇప్పుడే పడుకో బోయే లోపు, నీకు అన్నీ వివరాలు పంపిస్తాను," అని లక్షి చెప్పి ఫోన్ కట్ చేసి, లారెన్స్ నంబర్ డయల్ చేసింది.

"హనీ, లక్షి ఇక్కడ. ఏం చేస్తున్నావు?"

"ఇప్పుడే లంచ్ అయ్యింది. ఇవ్వాళంతా డెస్క్ జాబ్. మొన్న ఈ పాటికి సియన్ నది మీద మీ అమ్మ, నాన్న ల తో డిన్నర్ చేస్తున్నాము కదా. థాంక్స్ ఫర్ ది లవ్లీ సర్ప్రైజ్. మూవాహ్..., "అంటూ ఫోన్ లోనే ముద్దు పెట్టేసాడు లారెన్స్.

"థాంక్స్," ఎరుపెక్కిన బుగ్గలతో లక్షి ," మరి మీ అమ్మా, నాన్నలను ఎప్పుడు పరిచయం చేస్తావు?" అని అడిగింది.

"ఈ సారి థాంక్స్ గివింగ్ మా పేరెంట్స్ ఇంట్లోనే. ఇంకో నెలే ఉంది. అన్నట్లు నన్ను కలిసిన తరువాత మీ పేరెంట్స్ తో చెక్ చేశావా? నా గురించి ఏమన్నారు?"

'ఎవరో ఒకరిని, తొందరగా చేసుకోవే ' అంటున్న అమ్మ మాటలు, ' అబ్బాయి బాగున్నాడమ్మ. నీ సెలక్షన్ బాగుంది ' అన్న నాన్న మెప్పుకోలు, మదిలో మెలిగాయి.

"వీడేలా నీకు తగిలాడన్నారు," అని లారెన్స్ రియాక్షన్ కోసం ఆగింది లక్షి . గుర్ అని అవతల శబ్దం వినపడటం తో, గట్టిగా నవ్వేస్తు," జస్ట్ కిడ్డియింగ్. నీకేం తక్కువ. నేను సెలెక్ట్ చేసాను కదా. ఫస్ట్ క్లాస్ అనే అన్నారు. నువ్వు ఇద్దరికీ నచ్చావు."

"నువ్వు మా పేరెంట్స్ కు తప్పకుండా నచ్చు తావు. బ్యూటీ విత్ బ్రెయిన్స్."

"ఏదో బ్రెయిన్స్ బోనస్ లాగా మాట్లాడుతున్నావు. థాంక్స్ గివింగ్ మీ ఇంట్లోనా. అప్పుడే నెర్వస్ గా ఉంది నాకు. అన్నట్లు చెప్పాలనుకున్న విషయమే మరిచాను. ప్యారిస్ లో ఒక వారం ట్రిప్ అనుకున్నాను కదా. సింగపూర్ వెళ్లాల్సి వస్తున్నది. ముందు అనుకున్నట్లే అమెరికాకు వస్తాను. ఇదో డిటూర్ అనుకో. కొత్త ఫ్లైట్ వివరాలు తొందరలో పంపిస్తాను. రిసీవ్ చేసుకో. సీ యూ," అంటూ లక్షి ఫోన్ పెట్టేసింది.

బ్యాంక్ వాళ్ళు పంపిన తన సింగపూర్ ఫ్లైట్ టికెట్లు, లక్షి ఆయేష కు ప్రోజెక్ట్ వివరాలు పంపుతుండగా అందాయి. పొద్దున్నే ఫ్లైట్.

ప్యారిస్ లో రాత్రి పడుకున్న లక్షి కి వెంటనే నిద్ర. ఆయేష చెప్పిన భూకంపం వల్లనేమో లక్షి కి భూకంపం కలనే వచ్చింది. ఏదో భూకంలో ఇరుక్కు పోయింది లక్షి . తన పైన వంద అంతస్థుల మీద కూలి పోయింది. తను పడిన

స్థంబాల మధ్యలో ఉన్న కొంత ఖాళీ స్థలము లో బందీ లా చిక్కుక పోయింది. తను కదలకుండా తన ఒక కాలు మీద కూలిపోయిన పిల్లర్. ఇంతలోనే, ఆ పిల్లర్ స్టీవ్ లాగా రూపాంతరం చెంది నవ్వసాగింది. లక్షి కి కలలో కూడా నవ్వే వచ్చింది కానీ ఆ కల భయపెట్ట లేదు.

(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments